**రెండు వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి.. బాలస్వామి స్పెషల్‌గా బుక్ ఫెయిర్ కోసమే హైదరాబాద్ వచ్చాడు. ఆదివారం కావడం వల్ల సాయంత్రం నాలుగింటికే ఆ ప్రాంగణం కిటకిటలాడుతున్నది. ఇంకో రెండ్రోజుల్లో ముగుస్తుంది కాబట్టి.. ఈరోజు చాలామంది రచయితలు వస్తారు. వారినందర్నీ కలవచ్చనీ, వీలైతే సెల్ఫీలు తీసుకోవచ్చనీ బాలస్వామి ఎంతో హుషారు మీదున్నాడు.**

# సెల్ఫీ @బుక్ ఫెయిర్!



లోపల కుడివైపున్న పెద్ద వేదికపై పదిమంది కూచొని ఉన్నారు. మైకు దగ్గర లాల్చీపై శాలువా కప్పుకొన్న ఓ పెద్దాయన మాట్లాడుతున్నాడు. పేపర్‌లో చాలాసార్లు బాలస్వామి ఆయన ఫొటోతో సాహితీ సమ్మేళనాల వార్తలు చూశాడు. ఆ గౌరవంతో ఆ కవి రాసిన పుస్తకాలు కూడా కొన్నాడు. ఆయన మాట్లాడేది విందామని షామియానా కింద ఉన్న చివరి కుర్చీలో కూచున్నాడు బాలస్వామి.

''కవి ఎప్పుడూ వేడిగా ఉండే దోశ పెనంలా ఉండాలి. ఆలోచన రాగానే దాన్ని అక్షరాల్లోకి దింపాలి. నేనిప్పుడేమీ రాయడం లేదు. అయినా తల్లి కోడిలా రాస్తున్న కవులకు దగ్గరే ఉంటాను. ఈ కవి హైదరాబాద్ వచ్చినప్పుడల్లా నా ఇంటికి వస్తాడు. నన్ను తన అమ్మతో పోల్చాడు'' అని ఆగి, జుట్టు సవరించుకొంటూ ఆ కవివైపు తిరిగి.. 'ఔనా నాన్నా!' అని ఔననిపించి, ఓ బోసినవ్వు నవ్వాడు. తనను ఇంటికి తీసుకెళ్లి ఏమేమి మర్యాదలు చేశాడో ఏకరువు పెడుతుంటే.. కుర్చీలు ఖాళీ అవుతున్నాయి.

'ఎన్నో స్టాళ్లు చూడాలి. వాటి దగ్గర కనిపించే రచయితలను చూడాలి. వీలైతే పలకరించాలి. అవకాశమిస్తే సెల్ఫీలు దిగాలి' అని గుర్తొచ్చిన బాలస్వామి లేచి స్టాళ్ల వైపు నడిచాడు. గేటు పక్కనున్న మొదటి స్టాల్ వద్దే ఓ సినిమా పాటల రచయిత కనిపించాడు. ''నమస్కారం సార్! మీరు పాటలు రాస్తారు కదా! మీకు అవార్డు వచ్చినపుడు అభినందిస్తూ పత్రికలో లేఖ రాశాను'' అంటూ దగ్గరగా వెళ్లాడు పలకరింపుగా. ఆ రచయిత చటుక్కున వెనక్కి జరిగి.. బాలస్వామిని పురుగు చూసినట్లు చూశాడు. 'సెల్ఫీ అడుగుదామా!? వద్దా!?' అని బాలస్వామి తటపటాయిస్తుండగానే.. ఆ రచయిత ''హాయ్!'' అంటూ ఎవరివైపో చేయి ఊపుతూ వెళ్లిపోయాడు.

'ఏదో బిజీగా ఉన్నాడులే!?' అనుకొని బాలస్వామి ముందుకు నడిచాడు.

ఇందాక వేదికపై మాట్లాడిన సీనియర్ కవి కిందికి దిగగానే.. ఊర్ల నుంచి వచ్చినవారు ఆయనతో గ్రూప్ ఫొటోలకు ఎగబడుతున్నారు. తనేమో ఒంటరి. ఈ జనంలో ఎవరికైనా ఫోను ఇచ్చి ఫొటో తీయమంటే.. వాడు తప్పిస్తే దొరకబట్టలేం. అందరూ అయిపోయాక.. ''సార్! మీ కవిత్వం అంటే ఎంతో ఇష్టం. ఓ సెల్ఫీ'' అంటూ.. ఫోను ఎత్తుకుంటూ దగ్గరికెళ్లాడు. ''ఆ గ్రూపులో ఉండాలి కదా!'' అంటూ, ఆయన నాలుగడుగుల్లో వేదికపైకి వెళ్లాడు. ఆయన తన వెనుక కనిపించేలా బాలస్వామియే సెల్ఫీ తీసుకున్నాడు.

ఓ స్టాల్ దగ్గర తమ ఊరి సాహితీవేత్త కనిపించాడు. బాలస్వామి ఆయన కలిసి చదువుకున్నారు కూడా. ఆ వేత్త ఇప్పుడు హైదరాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తూ.. ఓ సాహితీ సంస్థను నడుపుతూ అవార్డులు ఇస్తున్నాడు. ఆయన చుట్టూ.. 'గురువుగారూ! నమస్కారం' అంటూ పిల్ల రచయితలు చేరారు. ఆయన చిద్విలాసంగా వాటిని స్వీకరిస్తున్నాడు. ఆ క్షణాన బాలస్వామి.. ''ఒరేయ్ వీరిగా..'' అంటూ దగ్గరికి వెళ్లాడు. ఆ మాటకు వీరుడు ముఖం పులిసిపోయినట్లు పెట్టాడు. వెంటనే తేరుకొని.. ''వేదికపైకి వెళ్లాలి. పిలుస్తున్నారు'' అంటూ జారుకున్నాడు.

'ఇంతమందిలో గుర్తుపట్టనట్టున్నాడు!' అనుకుంటూ.. బాలస్వామి ముందుకు సాగాడు.

పక్క స్టాల్ దగ్గర ఓ కథా రచయిత కనిపించాడు. ''సార్! మీరు కథలు బాగా రాస్తారు కదా!'' అని చేయి కలిపాడు. ''థాంక్స్ అండీ.. బాగున్నారా! ఎక్కడి నుంచి వచ్చారు?'' అని ఆయన కుశల ప్రశ్నలు వేయడంతో.. బాలస్వామి మనసు కాస్త తేలికైంది. ఆ చొరవతో.. ''సార్.. మనం సెల్ఫీ తీసుకుందామా?'' అని అడిగాడు.

''సెల్ఫీదేముంది సార్! నా పుస్తకాలు మీ దగ్గరేమున్నయ్'' అన్నాడు ఆ రచయిత. ''పుస్తకాలు లేవు కానీ, మీ కథలు చదివాను'' అన్నాడు బాలస్వామి. ''అవన్నీ ఈ బుక్స్‌లో ఉన్నాయి'' అంటూ.. ఓ ఐదు పుస్తకాలను బాలస్వామి చేతిలో పెడుతూ.. ఓ పిల్లాణ్ని పిలిచి బాలస్వామి ఫోన్లో తమ ఫొటో తీయించాడు. ఫోన్ చేతిలో పెడుతూ.. ''మొత్తం పదహారు వందలు'' అన్నాడా రచయిత. డబ్బులు ఇచ్చి బయటపడ్డాడు బాలస్వామి.

మరో స్టాల్ దగ్గర ఓ యువ రచయిత లాల్చీ జేబుల్లో చేతులు పెట్టుకొని ఎటో చూస్తూ కనిపించాడు. ఆయనకు ఈ మధ్యనే కేంద్ర అవార్డు దొరికింది. దగ్గరికెళ్లి.. ''నమస్తే సార్!'' అన్నాడు బాలస్వామి. ఆయన విననట్లే ఇంకో దిక్కు తిరిగాడు. బాలస్వామి అటువైపు వెళ్లి.. ''నమస్తే!'' అన్నాడు మళ్లీ. ఆయన పైకెత్తిన తల దించకుండానే తనలో తాను నవ్వుకుంటూ, మాట్లాడుకుంటూ మరోవైపు మరలాడు. ఆయన చుట్టూ తిరుగుతున్న బాలస్వామిని చూసిన ఒకాయన.. ''ఆయన బ్లూటూత్‌లో మాట్లాడుతున్నాడు'' అని చెప్పాడు. 'వార్నీ!' అనుకుంటూ ముందుకు నడిచాడు బాలస్వామి.

పక్కనే నలుగురైదుగురు రచయితలు చాయ్ తాగుతూ మాట్లాడుకుంటున్నారు. 'హాయిగా మాట్లాడుకుందాం అనుకుంటే.. ఎవరో వచ్చి 'సార్ సెల్ఫీ!' అంటారు'' అంటూ నవ్వుకుంటున్నారు వాళ్లు. ఆ మాటలు విన్న బాలస్వామి అక్కడే ఆగిపోయి.. పక్కనే ఉన్న చాయ్ డబ్బా దగ్గరికెళ్లి టీ కొనుక్కొని ఒక గుటక వేశాడు.

''ఏంటి సార్! ఒక్కసారి షాక్ తిన్నట్లు ఆగిపోయి ఇటువైపు వచ్చారు'' అన్నాడు చాయ్‌వాలా . ''ఏం లేదయ్యా!'' అంటూ, ఇందాక రచయితలతో తనకు జరిగిన అనుభవాల్ని అన్నిటినీ ఆయనతో పంచుకున్నాడు. ''నాకూ సాహిత్యమంటే ఇష్టమే సార్! చాలా బుక్స్ చదివాను. ఎవరు ఏం రాశారో తెలుసు. నా దగ్గరికి చాయ్ కోసం వారిలో ఎందరో వస్తారు. ఎవర్నీ కూడా.. 'మీరు ఫలానా కదా!?' అనను. 'ఈ చాయ్ వానితో మనకు మాటలెందుకు!?' అనుకుంటారు. అయినా.. మీరు వచ్చింది పుస్తకాల కోసం కానీ, రచయితల కోసం కాదు కదా!'' అన్నాడు ఆ చాయ్‌వాలా.

'ఎంత బాగా చెప్పాడు!? ఇది పుస్తకాల పండుగ. రచయితల ములాఖత్ కాదుకదా!?' అనుకుంటూ.. దించిన తల ఎత్తకుండా, పుస్తకాలనే చూసి అవసరమున్నవి కొనుక్కున్నాడు బాలస్వామి. బుక్ ఫెయిర్ తోరణం వద్ద నాలుగు సెల్ఫీలు తీసుకొని బయటపడ్డాడు. ■

... ✍ బి. నర్సన్